అక్కచెల్లెమ్మలకు ఆసరా

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు తీరని అన్యాయం చేసింది. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని నమ్మించి మోసం చేసింది. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. డ్వాక్రా సంఘాలకు రుణాలిచ్చి అదుకుంటున్నారు. ఆ సొమ్ముతో మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా చెల్లింపులు జరిగాయి. ఇటీవల నాల్గో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజక వర్గాల్లోని అక్కచెల్లెమ్మలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- మహిళలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం
- నాలుగో విడత సొమ్ములు విడుదల
- మూడు నియోజకవర్గాల్లో 14,157 ఎస్‌హెచ్‌జీలకు రూ.116.78 కోట్ల లబ్ధి
- నాలుగు విడతల్లో రూ.467.23 కోట్లు చెల్లింపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్/తుని రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు అందిస్తున్నారు. ఆయా రుణాలతో సంఘ సభ్యులు చిరు వ్యాపారులు చేసుకొని, కుటుంబ పోషణకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో...

ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 1,48,880 మంది డ్వాక్రా సభ్యులకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.353.22 కోట్లు జమ చేశారు. ఆఖరిగా నాల్గో విడత సొమ్ములు రూ.రూ.117.74 కోట్లను ఇటీవల విడుదల చేశారు. నాలుగు విడతల్లో వెరసి మూడు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 14,157 ఎస్‌హెచ్‌జీలకు రూ.467.23 కోట్లు లబ్ధి చేకూరింది.



ప్రత్తిపాడులో ఆసరా లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

టీడీపీ హయాంలో అన్యాయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రుణాలు చెల్లించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చాక బాబు హామీ ఊసే ఎత్తలేదు. మహిళలు తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంలో మహిళలకు రుణాలు ఇచ్చి అదుకుంటున్నారు.

మండలాలు వారీగా ఎస్‌హెచ్‌జీలు, చేకూరిన లబ్ధి

మండలం	ఎస్‌హెచ్‌జీలు	నాలుగో విడత (రూ.కోట్లలో)	నాలుగు విడతల మొత్తం (రూ.కోట్లలో)
తుని	1826	రూ.16.08	రూ.64.37
తుని పట్టణం	693	రూ.5.32	రూ.21.27
తొండంగి	1481	రూ.12.09	రూ.48.35
కోటనందూరు	1039	రూ.8.22	రూ.32.88
గండేపల్లి	1189	రూ.8.83	రూ.35.34
జగ్గంపేట	1818	రూ.16.39	రూ.65.57
కిర్లంపూడి	1764	రూ.15.30	రూ.61.20
ప్రత్తిపాడు	1600	రూ.13.64	రూ.54.57
రౌతులపూడి	799	రూ.5.17	రూ.20.68
శంఖవరం	1055	రూ.8.05	రూ.32.22
ఏలేశ్వరం	893	రూ.7.69	రూ.30.78
మొత్తం	14,157	రూ. 116.78	రూ. 467.23

మహిళలకు ఆర్థిక భరోసా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఎన్నికల్లో డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మూడు విడతల సొమ్ములు డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశారు. నాల్గో విడత సొమ్ములను ఇటీవల ప్రభుత్వం జమచేసింది. జైదేవి డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉన్న నాకు నాలుగు విడతల్లో కలిసి రూ.42,800 లబ్ధి చేకూరింది.

– చిట్టూరి లోవకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ప్రత్తిపాడు

అతివలకు అండగా ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలను అన్నివిధాలా ఆదుకుంటోంది. ఉపర్ ఆలీషా సంఘంలో సభ్యురాలిగా ఉన్న నాకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.49,200 లబ్ధి చేకూరింది. దీంతో పాటు అమ్మఒడి, చేయూత తదితర పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. ఈ సొమ్ములతో పాడి గేదెలను కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నాం.

– చికలమర్తి సుబ్బలక్ష్మి, డ్వాక్రా మహిళ, శరభవరం, ప్రత్తిపాడు మండలం

వ్యవసాయ పనులకు తోడ్పాటు



ధర్మవరంలోని కనకదుర్గ పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరి బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.58 వేలు రుణాన్ని పొందాను. ఈ సొమ్ములు మా కుటుంబానికి ఎంతగానో ఆర్థిక చేయూతను అందించాయి. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.43,500 లబ్ధి చేకూరింది. ఈ సొమ్ములు వ్యవసాయానికి తోడ్పాటునందించాయి. అలాగే ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత పథకాలు అందించడంతో మాకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది.

– కానూరి చక్రవేణి, డ్వాక్రా సభ్యురాలు, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

రుణ పరపతి పెరిగింది



వైఎస్సార్ ఆసరాతో రుణ, అధిక వడ్డీభారాల నుంచి డ్వాక్రా సంఘాలు విముక్తులయ్యాయి. వైఎస్సార్ ఆసరా పథకంలో మా సంఘానికి రూ.18 లక్షలు లబ్ధి చేకూరింది. తీసుకున్న రుణాలను చెల్లించే స్థాయికి ఎదిగాం. ఇప్పుడు మా సంఘమే కాకుండా మండలంలోని ఎస్‌హెచ్‌జీలు సవ్యంగా నడుస్తున్నాయి. రుణ పరపతి పెరిగింది.

– బి.సూర్యకుమారి, మండల సమాఖ్య కోశాధికారి, వి.కొత్తూరు

అర్హులందరికీ వర్తింపు



తుని మండలంలో 27 గ్రామ సచివాలయాల పరిధిలో 1826 స్వయం సహాయక సంఘాల్లో 18 వేలకుపైగా మహిళలు సభ్యత్వం కలిగి ఉన్నారు. అర్హులైన అన్ని సంఘాలకూ వైఎస్సార్ ఆసరా వర్తింపజేశాం. నాలుగు విడతల్లో మహిళలు రూ.64.37 కోట్లు లబ్ధి పొందారు. 2019 నుంచి రుణాల చెల్లింపు సక్రమంగా ఉండడంతో బ్యాంకర్లు మళ్లీ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– వై.సత్తిబాబు, ఏపీఎం, తుని మండలం

క్లుప్తంగా

అన్నవరం దేవస్థానానికి వెండి పాత్ర వితరణ



దేవస్థానానికి దాత చెంచురామారావు అందజేసిన వెండి పాత్ర

అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి తెనాలికి చెందిన వీసీఆర్ ట్రేడర్స్ అధినేత వందవాశి చెంచురామారావు రూ.35 వేలు విలువ చేసే 504 గ్రాముల వెండి పాత్రను ఆదివారం అందజేశారు. ఈ పాత్రను సత్యదేవుని ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఉపయోగించాలని దాత కోరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



ప్రత్తిపాడు వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న న్యాయవాది బలరాముడు

ప్రత్తిపాడు: సంతానాన్ని నమ్మి ఆస్తులు ఇచ్చినప్పటికీ తల్లిదండ్రులు నిరాధరణకు గురవుతున్నారని మానవ హక్కుల సంరక్షణ కౌన్సిల్ జాతీయ లీగల్ కార్యదర్శి, న్యాయవాది పిల్లి బలరాముడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై గల పాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల శ్రీశారదా వయోవృద్ధ నిలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. వృద్ధ మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం నోటీసులు అందజేస్తామన్నారు. అనంతరం వృద్ధులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాకాడు నూకరాజు, దూలపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి వారి నుంచి 54 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో భద్రరావు, వెంకటరమణ, అప్పారావులను అరెస్టు చేసి వారి నుంచి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఎస్సై తెలిపారు.


అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకటరాజును సత్కరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తుని: గణతంత్ర వేడుకల్లో భాగంగా కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మున్సిపల్ ఉద్యోగి పేరిచెర్ల వెంకటరాజును ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తుని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రిక్రియేషన్ హోమ్ ప్రతినిధులు వెంకటరాజును శాలువా, పూలమాలలతో సత్కరించారు. వెంకటరాజు పట్టణ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌తో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



జి.కొత్తపల్లి డ్రైన్‌లో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: ప్రభుత్వం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు. రోడ్లును శుభ్రం చేసి రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కోరారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరం గ్రామ శివారున వేంచేసిన సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

‘సిద్ధం’ బహిరంగ సభను జయప్రదం చేయండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గోకవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

గోకవరం: వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఫిబ్రవరి 1న ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన సిద్ధం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మరో రెండు నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువ నేత తోట రాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సమ్మెటి మోహన్, నరాలశెట్టి నర్శయ్య తదితరులు పాల్గొన్నారు.

‘సిద్ధం’ సభను విజయవంతం చేయాలి



ఎస్.తిమ్మాపురంలో కార్యకర్తలను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వచ్చే నెల 1న ఏలూరులో జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని ఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని సింహాద్రిపురం, భూపాలపట్నం, శృంగరాయుని పాలెం, ఎస్.తిమ్మాపురం, గోనేడ, పాలెం, సోమరాయణంపేట గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి సిద్ధం సభ విజయవంతంపై చర్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తోట అయ్యన్న, ఓలేటి రాజు, బేరి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఏలేశ్వరంలో స్వామి రామానందకు స్వాగతం పలుకుతున్న భక్తులు

ఏలేశ్వరం: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద అన్నారు. పట్టణంలో ఆదివారం సత్తి గిరిధర్ రెడ్డి, సితార పుణ్య దంపతుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. గిరిధర్ రెడ్డి దంపతులు స్వామి రామానందకు పాదపూజ చేసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి రామానంద ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన

- వైఎస్సార్ సీపీ నియోజకవ్గ ఇన్‌చార్జి తోట నరసింహం

గోకవరం: గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల పారదర్శక పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం అన్నారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం గ్రామ వలంటీర్లు, డ్వాక్రా యానిమేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన నాలుగున్నరేళ్లగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చడంలో వలంటీర్లు సేవలు అభినందనీయమన్నారు. పింఛన్లు పంపిణీ, ఇతర సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల సేవలు కీలకమన్నారు. ఇదే ఒరవడితో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అందేలా కృషి చేయాలని సూచించారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా తదితర పథకాల అమలుకు డ్వాక్రా యానిమేటర్లు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం వలంటీర్లు, యానిమేటర్లు తోట నరసింహాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సమావేశంలో యువనేత తోట రాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, కర్రి సూరారెడ్డి, సమ్మెటి మోహన్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘పల్లెకు పోదాం’ను విజయవంతం చేయాలి



ఏలేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

ఏలేశ్వరం: బీజేపీ ప్రతిష్టాత్మంగా చేపట్టే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. పట్టణంలో ఆదివారం బీజేపీ నియోకవర్గ కన్వీనర్ ఘంటా బాలుదొర ఆధ్వర్యంలో ఏలేశ్వరం అర్బన్, రూరల్, ప్రత్తిపాడు మండల బీజేపీ శక్తి కేంద్ర ప్రముఖ్‌లతో సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్, రాష్ట్ర విస్తారక్ ఉన్నికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల మొదటి వారంలో చేపట్టే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లా శ్రీనివాస్, సింగిలిదేవి సత్తిరాజు, గట్టెం వెంకటరమణ, కురాకుల రాజా, వెలుగూరి హరేరామ్, రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- వాకపల్లిలో ఆత్మీయ సమావేశం



వాకపల్లి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకూ మేలు చేకూరిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని వాకపల్లిలో ఏఎంసీ డైరెక్టర్ రేఖా లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత రేఖా శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆధరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. తొలుత రౌతుపాలెంలో నిమ్మల చక్రం, ఒమ్మంగిలో మామిడి నరసింహమూర్తిలను వరుపుల సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, పార్టీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, పార్టీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, రాపా గుర్రాజు, పంద్రాడ రాము తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



లింగంపర్తిలో వరుపులను కలిసిన తిరుమాలి గ్రామ వైఎస్సార్ సీపీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. లింగంపర్తిలోని తన స్వగృహం వద్ద ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. తొలుత మండలంలోని తిరుమాలి గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు వరుపుల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, ఏనుగు అర్జునుడు, ఏనుగు బాబూరావు, కోరుకొండ రామచంద్రరావు, పసల అర్జునుడు, ఓలేటి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పొన్నాడకు చెందిన లక్కేరావు మోటారు సైకిల్‌పై కాకినాడ విధులకు వెళుతుండగా అమీనాబాదు శివారు రామన్నపాలెం సమీపంలో ఉప్పాడ నుంచి కోనపాపపేట వైపు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్కేరావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

గండేపల్లి: స్థానిక కొత్తపేటలో నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయానికి దాత కోర్పు సాయితేజ ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో అడబాల వేంకటేశ్వర రావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లూరు మఠం వివాదంపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠం వివాదంపై దేవదాయ, ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ కమిషన్ ఆదివారం ఆలయం వద్ద విచారణ నిర్వహించింది. పిటీషనర్‌కు దేవదాయశాఖ తూర్పు గోదావరి జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నరసింహరావు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వివరాలను నమోదు చేసుకుని దీనిపై మరోసారి విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పరిపాలనా వ్యవహారాలు దేవదాయశాఖ పరిధిలో ఉండాలని, ఎవరికీ ధారాదత్తం చేయడం కుదరదన్నారు. కొంత మంది అర్చకులు గ్రూపుగా ఏర్పడి మఠం ఆస్తులను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జీయ్యన్న మఠం, మఠాధిపతి హోదా తమకే దక్కుతుందని పిటీషన్‌దారుడు పాడుగు శేషావతారం తన వద్ద ఉన్న రికార్డులను బహిర్గతం చేశారు. తొలుత అధికారులు, కౌన్సిల్ సభ్యులు జీయన్న మఠంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ ఉండమట్ల రాజేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ని సత్యనారాయణ, సర్పంచ్ శీలామంతుల వీరబాబు, మాజీ సర్పంచ్ పైణ్ని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజ్యలక్ష్మి ఉద్యానం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన నేపథ్యంలో సీతారాముల పట్టాభిషేకం, హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాలిదేవర బాలాజీ పాల్గొన్నారు.



రాజ్యలక్ష్మి ఉద్యానంలో స్వామివారికి పూజలు